సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం । 11 । జూలై । 2025



చిరుత సంచారం

మహబూబ్‌నగర్ శివారులో చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలి.

వివరాలు 8లో ▸



జూరాలకు వరద

ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.7 /21.6

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.



ఇద్దరే ముద్దు..!

ఆధునిక యుగంలో జీవన ప్రమాణాలు మారాయి. కాలంతో పాటే పరిగెడుతున్న సమాజం ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. మారిన జీవన పరిస్థితుల్లో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. పెరిగిన వ్యయాలకనుగుణంగా రాబడి లేకపోవడం.. అమాంతంగా పెరిగిన ఖర్చులు.. భార్యాభర్తలిద్దరూ జాబ్ చేయాల్సి రావడం వంటి కారణాలతో ఈ తరం ఒక్కరు లేదా ఇద్దరు సంతానంతోనే సరిపెట్టుకుంటోంది. కానీ వచ్చే 20 ఏళ్లలో యువజనుల జనాభా తగ్గి, సీనియర్ సిటిజన్ల సంఖ్య పెరగనుండగా.. ముగ్గురికి పైగా పిల్లల్ని కనాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో యువతరం ఏమనుకుంటోంది అనే అంశంపై 'సాక్షి' చిన్న ప్రయత్నం చేసింది. నేడు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలో చేపట్టిన సర్వేలో తేలిన అంశాలపై ప్రత్యేక కథనం..

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

సర్వే సాగిందిలా..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో మొత్తం 80 మంది నుంచి 'సాక్షి' బృందం శాంపిళ్లు సేకరించింది. ఇటీవల కాలంలో వివాహం చేసుకున్న దంపతులు, త్వరలో పెళ్లి చేసుకోనున్న యువతకు సంబంధించి ఒక్కో జిల్లాకు 16 మంది చొప్పున అభిప్రాయాలు తీసుకుంది. ఇందులో భార్యభర్తలది ఉమ్మడిగా ఒకే అభిప్రాయం కింద పరిగణించగా.. ఎంచుకున్న నాలుగు ప్రశ్నలకు ఒక్కొక్కరి వద్ద సమాధానం రాబట్టడంతో పాటు వారి అభిప్రాయాలను క్రోడీకరించాం.


- సంతానంపై కొత్త దంపతులు, యువత ప్రణాళిక
- సంపాదన మేరకే పిల్లలు అంటూ బేరీజు
- రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులే కారణమని వెల్లడి
- ఉమ్మడి కుటుంబంపైనే అధిక శాతం మంది మక్కువ

ఉమ్మడి కుటుంబం వైపే మొగ్గు..


మారిన జీవన పరిస్థితుల్లో ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో యువ దంపతులు, యువత 71.25 శాతం మేర ఇద్దరి సంతానం వైపే మొగ్గు చూపారు. ఇదే క్రమంలో ఉమ్మడి కుటుంబమే మేలని 52.50 శాతం మంది.. పెరుగుతున్న నిత్యవసరాల ధరలు, స్కూళ్లు, హాస్పిటళ్ల ఖర్చుల వంటి ఆర్థిక భారం కారణంగానే ఒకరిద్దరు సంతానమే చాలని 51.25 శాతం మంది.. సంవత్సరం తర్వాతే సంతానంపై ఆలోచన చేస్తామని 40 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇద్దరు సంతానంలో మగ, ఆడ ఉండాలని ఆకాంక్షించారు. భార్యాభర్తలిద్దరూ జాబ్ చేయాల్సి రావడం.. పిల్లలను చూసుకునే వారు లేకపోవడం వంటి కారణాలతో 36.25 శాతం మంది దంపతులు ఒకరిద్దరు సంతానంతోనే సరిపెట్టుకోవాలని భావిస్తున్నట్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నాలుగు చొప్పున శాంపిళ్లు సేకరించాం. ఇందులో ఎంత మంది సంతానం కావాలని కోరుకుంటున్నారనే ప్రశ్నకు మూడు జంటలు ఒక్కరని సమాధానమిచ్చారు. ఇద్దరు కావాలని 12 మంది, ముగ్గురు పిల్లలు కనాలని ఉందని ఒక్కరు చెప్పారు. ఉమ్మడి కుటుంబమా.. ఒంటరిగా ఉండడం ఇష్టమా అనే ప్రశ్నకు ఉమ్మడి కుటుంబం అని 10 మంది, విడిగా ఉంటేనే బాగుంటుందని ఆరుగురు తెలిపారు. పిల్లల కోసం ప్లాన్ ఎలా చేసుకున్నారనే ప్రశ్నకు వెంటనే కంటామని నలుగురు, సంవత్సరం తర్వాత ప్లాన్ చేస్తామని పది మంది, రెండేళ్ల తర్వాత అని ఇద్దరు సమాధానమిచ్చారు. ఈ తరంలో ఎందుకు ఒక్కరిద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనడం లేదని ప్రశ్నిస్తే.. ఇద్దరం జాబ్ చేయాల్సి రావడం, పిల్లలను చూసుకునే వారు లేక అని ఐదుగురు సమాధానమిచ్చారు. ఆర్థిక ఇబ్బందులే కారణమని తొమ్మిది మంది, ఈ కారణాలతో పాటు ఇతరత్రా సమస్యలు అని ఇద్దరు చెప్పారు.

మీరు ఎంత మంది పిల్లలను కనాలని అనుకుంటున్నారు ?




ఉమ్మడి కుటుంబమా.. విడిగా ఉండడం ఇష్టమా ?



పెళ్లి చేసుకున్నాక.. పిల్లల కోసం ప్లాన్ ఎలా చేస్తారు ?



ఈ తరంలో ఒక్కరు, ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనడం లేదు.. ఎందుకు ?



న్యూస్‌రీల్

విధుల్లో చేరిన జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్



కందనూలు: జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా టి.ఉషారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జీఎంసీ ఆస్పత్రి పిడియాట్రిక్ విభాగంలో పనిచేస్తున్న ఆమె బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన రఘు ఆమెకు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

క్రీడా అకాడమీలో ప్రవేశాలు

కందనూలు: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఎల్‌బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటుచేసిన క్రీడా అకాడమీలో 2025–26 విద్యా సంవత్సరం బాలబాలికలకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు డీవైఎస్‌ఓ సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో ప్రవేశాల ఈ నెల 15, 16 తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు విద్యార్హత, జనన, క్రీడా ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 7గంటలకు ఎల్‌బీ స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.

అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి



బిజినేపల్లి: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని పాలెం కేవీకే శాస్త్రవేత్త డా.శైల అన్నారు. గురువారం మండలంలోని అల్లీపూర్, పోలేపల్లి, నందివడ్డెమాన్, మహదేవునిపేట గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తిపంట మొక్కల సంఖ్యను లెక్కించారు. ఈ పద్ధతిని అనుసరించిన రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



నాగర్‌కర్నూల్: విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను ముందుండి పరిష్కరిస్తామని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కాగా, గతంలో ఇక్కడ ఎస్‌ఈగా పనిచేసిన పాల్‌రాజ్ హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయానికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో మేడ్చల్ ఎమ్మార్టీ డీఈగా పనిచేస్తున్న వెంకట నర్సింహారెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పెరుగుతున్న జనాభాతో అనర్థాలు

బాదేపల్లిలోని శ్రీవెంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న అమరవాది ప్రభు, విజేత దంపతులు చిరు వ్యాపారంతో జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి వివాహం జరిగి 12 ఏళ్లు గడుస్తుండగా తల్లిదండ్రులతో కలిసి ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నారు. వీరికి నాలుగేళ్ల వయస్సు గల ఓ పాప ఉంది. రోజురోజుకూ పెరుగుతున్న జనాభాతో అనేక అనర్థాలు జరుగుతున్నాయన్న ఆలోచనతో ఒకరిద్దరు సంతానం చాలని భావిస్తున్నారు. వీరినే ప్రయోజకులుగా తీర్చిదిద్ది దేశానికి సరైన విధంగా తయారు చేసే పరిస్థితి ఉంటుందన్నారు. అధిక జనాభాతో దేశంలో క్రమశిక్షణ లోపిస్తుందని అభిప్రాయపడుతున్నారు.



సమాజానికి మంచి..

బాదేపల్లిలోని శ్రీసాయినగర్ కాలనీకి చెందిన నరేష్, వీణ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆస్తులు ఉన్నా అధిక సంతానం అనర్థానికి దారి తీస్తుందన్నది వీరి అభిప్రాయం. ఇద్దరికి చక్కటి విద్యను అందించగలిగితే వారు ఉన్నత స్థాయికి ఎదగడంతోపాటు సమాజానికి మంచి చేస్తారని భావిస్తున్నారు. అధిక జనాభా వలన మౌలిక సదుపాయాల కల్పన, పర్యవేక్షణ, క్రమశిక్షణ గాడి తప్పుతుందని, పాలనాపరమైన సమస్యలు ఎదురవుతాయని, సరైన సేవలు, సౌకర్యాలు అందక ఆందోళనలు చోటు చేసుకునే పరిస్థితులు దాపురిస్తాయని పేర్కొంటున్నారు.



వృద్ధిరేటు తగ్గుముఖం



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏటేటా తగ్గుతున్న జననాలు

- పెరుగుతున్న వయోవృద్ధుల సంఖ్య
- 1991 నుంచి జనాభా వృద్ధిరేటులో భారీగా తగ్గుదల
- భవిష్యత్‌పై ఆందోళన, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సంతానాన్ని తగ్గించుకుంటున్న వైనం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఏటా జనాభా వృద్ధిరేటు గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. గత దశాబ్దకాలంగా శిశుజననాలు తగ్గుతుండగా, వయో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. శిశువుల రేటు కన్నా వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతున్న కారణంగా భవిష్యత్‌లో 'ఇతరులపై ఆధారపడే వారి నిష్పత్తి' పెరుగుతోంది. యువ జనాభా తగ్గుముఖం పడుతుండటం, వృద్ధుల జనాభా ఎక్కువగా ఉండటం వల్ల యువతపైనే సామాజిక, ఆర్థిక బాధ్యతలు పెరుగుతున్నాయి. 1991 నుంచి కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు, సామాజిక మార్పులు, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, న్యూక్లియర్ కుటుంబాలకు ప్రాధాన్యం పెరగడం, ఎక్కువ మంది సంతానం ఉంటే ఆర్థికంగా ఇబ్బందులు ఉంటాయన్న కారణంతో జననాల వృద్ధిరేటు గణనీయంగా పడిపోతోంది. 1951 నుంచి 2011 వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన జనాభా లెక్కల ఆధారంగా జనాభా వృద్ధిరేటు, మారుతున్న ట్రెండ్స్‌ను బట్టి పరిస్థితి అర్థమవుతోంది.

స్త్రీ, పురుష నిష్పత్తిలో పెరుగుతున్న అంతరం..

ఉమ్మడి జిల్లాలో మొత్తం జనాభాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉండాల్సిన స్త్రీల నిష్పత్తి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఆడ పిల్లల జననాలపై వివక్ష, అబార్షన్లు తదితర కారణాలతో మొత్తం జనాభాలో స్త్రీల నిష్పత్తి తగ్గుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాలో 7,45,101 మంది పురుషులకు 7,41,676 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 4,37,986 మంది పురుషులు ఉంటే 4,23,780 మంది స్త్రీలు ఉన్నారు. గద్వాల జిల్లాలో 3,09,274 మంది పురుషులు ఉండగా, 3,00,716 మంది స్త్రీలు, వనపర్తి జిల్లాలో 2,94,833 మంది పురుషులు ఉంటే 2,82,925 మంది స్త్రీలు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ జనాభా..

ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఎక్కువశాతం జనాభా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ జిల్లాలో 89.81 శాతం మంది గ్రామీణులు కాగా, 10.19 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నారు. గద్వాల జిల్లాలో 89.64 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో, 10.36 శాతం మంది పట్టణాల్లో నివసిస్తున్నారు. వనపర్తి జిల్లాలో 84.03 శాతం గ్రామాల్లో, 15.97 శాతం పట్టణాల్లో ఉంటున్నారు. మహబూబ్‌నగర్ (నారాయణపేటతో కలిపి) జిల్లాలో 79.27 శాతం గ్రామీణ జనాభా ఉండగా, 20.73 శాతం మంది పట్టణాల్లో నివసిస్తున్నారు.

1991 నుంచి భారీగా తగ్గుదల

ఉమ్మడి జిల్లాలో 1951 నుంచి చేపట్టిన జనాభా లెక్కలను పరిశీలిస్తే ప్రతి దశాబ్దానికి కనీసం 9 శాతం నుంచి 26 శాతం వరకు జనాభా వృద్ధిరేటులో పెరుగుదల కనిపించింది. అయితే 1991 నుంచి కుటుంబ నియంత్రణ పకడ్బందీగా అమలు, సామాజికంగా మార్పుల కారణంగా జనాభా వృద్ధి భారీగా తగ్గింది. 1951 నుంచి 1961 వరకు 9.92 శాతం వృద్ధి కనిపించగా, 1971 నాటికి ఏకంగా 21.46 శాతం జనాభా వృద్ధి నమోదైంది. 1981 నాటికి 26.53 శాతం, 1991లో 25.87 శాతం జనాభా వృద్ధి చెందింది. అయితే 1991 లో 25.87 శాతం నుంచి 2001 నాటికి జనాభా వృద్ధి 14.20 శాతానికి, అక్కడి నుంచి 2011 నాటికి 15.34 శాతానికే పరిమితమైంది.

1951 నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జనాభా వృద్ధిరేటు, ట్రెండ్స్ వివరాలు

సంవత్సరం	జనాభా (లక్షల్లో)	పెరిగిన జనాభా (లక్షల్లో)	వృద్ధిరేటు (శాతం)
1951	14.47	-	-
1961	15.91	1.44	9.92
1971	19.32	3.41	21.46
1981	24.45	5.13	26.53
1991	30.77	6.32	25.87
2001	35.14	4.37	14.20
2011	40.53	5.39	15.34

చిన్న కుటుంబాలకే ప్రాధాన్యం..

సుమారు రెండు దశాబ్దాల కిందటివరకు ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. జనాభా వృద్ధి ఎక్కువగా ఉందన్న కారణంతో 1991 నుంచి ప్రభుత్వం కుటుంబ నియంత్రణ అమలు కారణంగా ముగ్గురికన్నా ఎక్కువమందిని కనడానికి బదులుగా ఎక్కువ శాతం కుటుంబాలు ఇద్దరు సంతానానికే పరిమితం అయ్యాయి. చిన్న కుటుంబాలుగా మారుతూ తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలకే పరిమితం అవుతున్నాయి.

ముగ్గురు పిల్లలు కావాలనుకుంటున్నాం..



గత మే నెల 14న మాకు వివాహమైంది. నేను డిగ్రీ పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ.. ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేస్తాను. నా భార్య డిగ్రీ చదువుతోంది. ప్రతి ఇంట్లో ఒక్కరే పిల్లలు ఉంటున్నారు. ఈ విషయమై మేము ముగ్గురు పిల్లలను కనాలని భవిష్యత్ ప్లాన్ చేసుకున్నాం. మాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కావాలనుకున్నాం. ఒక్కొక్కరికి మధ్య కొంత వయస్సు గ్యాప్‌తో పిల్లలను కనాలని భావిస్తున్నాం.

– రాజేష్, మనుశ్రీ, కానాయపల్లి గ్రామం, కొత్తకోట మండలం

భవిష్యత్‌కు ప్రణాళిక..



నాకు ఏడాది కిందట రాయచూరు జిల్లా ఆత్కూరు గ్రామానికి చెందిన జయలక్ష్మితో వివాహమైంది. ఇద్దరం ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నాం. మేం రెండేళ్ల తర్వాత పిల్లల కోసం ప్లాన్ చేసుకున్నాం. ప్రస్తుతం జీవన ప్రమాణాలు పెరగడమే కాకుండా, కుటుంబం జీవన వ్యయం కూడా పెరిగింది. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తుండటంతో వచ్చిన డబ్బులను ఇప్పటి నుంచే పొదుపు చేసుకుని జాగ్రత్త పడితేనే భవిష్యత్‌లో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని తట్టుకోవడానికి సులభం అవుతుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని నా భార్య నేను కలిసి ప్లాన్ చేసుకుని ముందుకు వెళ్తున్నాం. అందుకే ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు వద్దనుకున్నాం.

– రమేష్, జయలక్ష్మి, గద్వాల పట్టణం

స్థిరపడిన తర్వాతే పిల్లలు..



మాకు ఇటీవలే వివాహమైంది. అయితే ఆర్థిక ఇబ్బందులను అధిగమించి వ్యాపారంలో స్థిరపడిన తర్వాతే పిల్లలు కనాలన్న ఆలోచనతో ఉన్నాం. ఒకరిద్దరు సంతానం ఉంటే సరిపోతుందని భావిస్తున్నాం. మౌలిక సదుపాయాలు, విద్య, ఉద్యోగ, ఉపాధి తదితర అవకాశాలు పెరుగుతున్న జనాభాతో కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. ఒకరిద్దరి సంతానం ఉంటే వారి పర్యవేక్షణ సులభతరం అవుతుంది. వీరినే మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్ది దేశానికి సేవ చేస్తే సరిపోతుంది.

– నరేష్, స్వప్న, నవాబుపేట

చింతలేని కుటుంబం



కూతురుతో రేణయ్య దంపతులు

అచ్చంపేట రూరల్: చిన్న కుటుంబంతో చింతలేకుండా గడపవచ్చని అంటున్నారు ఉప్పునుంతల మండలం కాంసానిపల్లి గ్రామానికి చెందిన వెల్టూరి రేణయ్య, కృష్ణకళ దంపతులు. ఒక్క కూతురు అర్షియారేణస్‌ను ఉన్నత చదువులు చదివించాలని నిశ్చయించుకున్నారు. చిన్న కుటుంబాల్లో తల్లిదండ్రులు పిల్లల చదువుపై ఎక్కువ శ్రద్ధ పెట్టగలరని భావిస్తున్నారు. జనాభా నియంత్రణలో చిన్న కుటుంబాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, పర్యావరణానికి కూడా మేలు చేస్తుందని అభిప్రాయపడుతున్నారు.

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న అమాత్యులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం



జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, తదితరులు

నాగర్‌కర్నూల్: జిల్లాలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు. ఉదయం 9:30 గంటలకు మాడ్గుల మండల కేంద్రంలో రూ. 12.70కోట్లతో 30 పడకల ఆస్పత్రి భవనం, 10:15 గంటలకు కోనాపూర్ నుంచి మాడ్గుల గుండా దేవరకొండ రోడ్డు వరకు రూ. 70కోట్లతో చేపట్టే బీటీరోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 220 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి.. 11:45 గంటలకు వెల్దండకు చేరుకుంటారు. అక్కడ వెల్దండ – సిర్సనగండ్ల వరకు రూ. 40కోట్లతో నిర్మించే బీటీ రోడ్డుకు, కల్వకుర్తి నుంచి కొట్ర గేట్ మీదుగా తలకొండపల్లి వరకు 22 కి.మీ. మేర రూ. 65కోట్ల వ్యయంతో నిర్మించే బీటీరోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2గంటలకు కల్వకుర్తికి చేరుకొని రూ. 45.50కోట్లతో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకొని మెడికల్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడే 550 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించనున్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు.

విద్య, వైద్యంలో జిల్లాను అగ్రభాగాన నిలపడమే లక్ష్యం

విద్య, వైద్యరంగాల్లో జిల్లాను అగ్రభాగాన నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. జిల్లాలో మంత్రుల పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నూతన భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ. 9కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో వట్టెంలో నూతన పాఠశాల భవనం నిర్మిస్తామన్నారు. రూ. 200కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ సముదాయం టెండర్ దశలో ఉందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో ఉన్న 100 పడకల ఆస్పత్రిని 330 పడకలకు పెంచడం జరిగిందన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో నూతన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రుల పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మాజీ కౌన్సిలర్లు నిజాం, సునేంద్ర, జక్కా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలి



బుగ్గకాల్వ చెరువును పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ అధికారి అథర్వ పవస్

వెల్దండ: ఉపాధి హామీ పథకం ద్వారా భూగర్భజలాల పెంపునకు దోహదపడే పనులు చేపట్టాలని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి అథర్వ పవస్ అన్నారు. గురువారం మండలంలోని చెదురుపల్లి బుగ్గకాల్వ చెరువులో చేపట్టిన ఒండ్రుమట్టి తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం చెరువులో మట్టి తీయడం వల్ల వర్షాకాలంలో ఎంతమేర నీరు చేరిందనే దానిపై పరిశీలన చేశారు. ఉపాధి హామీ పథకం రైతులు, ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని సూచించారు. ముఖ్యంగా భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రశేఖర్, క్రాంతికుమార్, పవస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్‌జీ, దేవేందర్, మంజుల పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



షిర్డీ సాయినాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం వద్ద ఉన్న భగవాన్ శ్రీసత్యసాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా, షిర్డీ సాయినాథుడికి భక్తులు అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రదోషకాలంలో ప్రత్యేక భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు వావిలాల రాజశేఖరశర్మ, కన్వీనర్ విశ్వప్రసాద్, ఈశ్వరయ్య, సువర్ణ, శారద, బాలకృష్ణ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మత్స్య రైతుల దినోత్సవంలో పాల్గొన్న జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజిని

నాగర్‌కర్నూల్ రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజిని సూచించారు. జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో గురువారం జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేపల సీడ్ ఉత్పత్తి, పెంపకం, చేపల మార్కెటింగ్ తదితర అంశాలపై మత్స్యకారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. చేపల రైతులు ఆక్వా కల్చర్ నిపుణుల సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యసహకార సంఘాల మండల అధ్యక్షుడు హరికృష్ణ, తెప్ప రుద్రయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


గుళ్ల నాగయ్య (ఫైల్)

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన మండలంలోని సల్కెలాపురం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకోగా గురువారం వెలుగు చూసింది. పోలీసులు, మృతుడి భార్య లక్ష్మి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుళ్ల నాగయ్య(40) వ్యవసాయ పొలంలో బుధవారం రాత్రి వరి నారుమడికి నీళ్లు పెడుతుండగా మోటార్ వద్ద విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉండటాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

కల్లు తాగి 'ఖిల్లా' వృద్ధురాలి మృతి


సింగనమోని వెంకటమ్మ (ఫైల్)

ఖిల్లాఘనపురం: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హైదర్‌నగర్ కల్లు దుకాణంలో కల్తీ కల్లు తాగి మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం మండల కేంద్రానికి చెందిన సింగనమోని వెంకటమ్మ(65) కుమార్తె అనసూయ హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు ప్రాంతంలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటుంది. కుమారుడు నాగయ్య నాగర్‌కర్నూల్‌లో తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల కుమార్తెను చూడటానికి వెంకటమ్మ కూకట్‌పల్లికి వెళ్లింది. దీంతో కుమార్తె హైదర్‌నగర్ కల్లు దుకాణం నుంచి ఆది, సోమవారం రెండు రోజులు కల్లు తీసుకెళ్లి తల్లికి తాగించింది. మంగళవారం విరోచనాలు కావడంతో తగ్గుతుందిలే అనుకున్నారు. కానీ రాత్రి వరకు ఎక్కువ కావడంతో బుధవారం ఉదయం నేరుగా నాగర్‌కర్నూల్‌లో ఉంటున్న కుమారుడు నాగయ్య వద్దకు తీసుకొచ్చి, ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం వృద్ధురాలు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొంకల యువకుడు తిరుపతిలో మృతి


వీరేష్ (ఫైల్)

రాజోళి: వడ్డేపల్లి మండలం కొంకల గ్రామానికి చెందిన యువకుడు చాకలి వీరేష్(20) తిరుపతిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సోములు, పద్మ దంపతుల రెండో కుమారుడు వీరేష్ మూడేళ్లుగా తిరుపతిలోని కంకర మిషన్‌కు ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన మరి కొందరు యువకులు కూడా అక్కడే పని చేసి వివాహం చేసుకొన్న తర్వాత గ్రామానికి తిరిగి వచ్చినప్పటికీ వీరేష్ అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మృతుడి తల్లిదండ్రులకు తిరుపతి నుంచి ఫోన్ చేసి మీ కుమారుడు చనిపోగా.. మృతదేహం రైలు పట్టాలపై పడి ఉందని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు వెంటనే తిరుపతికి బయలుదేరి వెళ్లారు. కాగా తమ కొడుకు ఆత్మహత్య చేసుకునేంత కారణాలు ఏం లేవని, మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బోరు మోటార్ వేయడానికి వెళ్లి..


వెంకటనారాయణ గౌడ్ (ఫైల్)

చారకొండ: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రాంపురం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ అంజయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటనారాయణగౌడ్(54) తన వ్యవసాయం పొలంలో బోరు మోటార్ వేయడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చిరుత సంచారంపై అప్రమత్తం


జిల్లాకేంద్రం వీరన్నపేట గుర్రంగట్టు ఏరియాలో డ్రోన్ కెమెరాతో తనిఖీ చేపడుతున్న పోలీసు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

- వీరన్నపేట గుర్రంగట్టు ఏరియాలో పర్యటించిన అధికారులు
- రెండు బోన్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటు
- డ్రోన్ కెమెరాతో సెర్చింగ్.. చిరుతను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదలాలని కలెక్టర్ ఆదేశం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నపేట గుర్రం గట్టు ప్రాంతంలో చిరుత సంచారం, ప్రజలకు రక్షణ వంటి అంశాలపై గురువారం కలెక్టర్ విజయేందిర కలెక్టరేట్‌లో ఎస్పీ డి.జానకితోపాటు పోలీసు, అటవీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చిరుత సంచరిస్తున్న ఏరియాలో సీసీ కెమెరాలు, బోన్‌ల ఏర్పాటు చేసినా చిరుత ఆచూకీ దొరకకపోవడంతో అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. చిరుతను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుర్రం గట్టు చుట్టూ కంచె ఏర్పాటు చేసి విడతల వారిగా 24 గంటల పర్యవేక్షణ చేయాలన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో..

కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వీరన్నపేట గుర్రంగట్టు చుట్టూ కలియదిరుగుతూ డ్రోన్ కెమెరాలతో సెర్చింగ్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. చిరుత సంచారంపై ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు, అటవీ శాఖలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుర్రంగట్టు పరిసరాల్లో చిరుత పులి సంచారంతో తమ భద్రత కోసం తగు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, క్షేత్రాధికారి కమాలుద్దీన్, లక్ష్మీకాంత్‌రావు, నాగజ్యోతి, డీఆర్‌డీఓలు, బీట్ అధికారులు గుర్రం గట్టు ఏరియాలో చిరుత సంచరిస్తున్న ప్రదేశాన్ని సందర్శించి డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు.

ప్రజలకు సూచనలు..

- ఒంటరిగా ఎక్కడికీ వెళ్లవద్దు. ముఖ్యంగా తెల్లవారుజామున, రాత్రి సమయంలో తిరగవద్దు.
- పిల్లలను ఒంటరిగా బయటకు పంపడం, ఆటలు ఆడుకోవడం చేయవద్దు
- రైతులు పశువులను మేత కోసం, ప్రజలు ఎండు కట్టెల కోసం అడవిలోకి తీసుకెళ్లొద్దు.
- అటవీ ప్రాంత శివారులో మద్యం తాగడాన్ని పూర్తిగా నివారించాలి.
- అటవీ ప్రాంతంలో ఆహార అవశేషాలు, పశువుల మృతదేహాలు పడవేయవద్దు
- చిరుత ఎదురైతే భయపడకుండా, చేతులు పైకి ఎత్తి, నెమ్మదిగా వెనక్కి అడుగులు వేయాలి.
- అడవిలోకి, పొలాల వద్దకు వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలి.
- అరణ్య సమీప ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన నివారించి.. మరుగుదొడ్లు వినియోగించండి.
- ఏదైనా సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలి.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం

- తాము తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే చూపాలి
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ధ్వజం


రహదారి విస్తరణపై కొలతలు వేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల: తాము తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే చూపాలి తప్ప.. పదేపదే అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జడ్చర్లలో ఎన్‌హెచ్-167 విస్తరణకు సంబంధించి బీఆర్‌ఎస్‌కు చెందిన వారి ఇళ్ల వద్ద కొలతలను కుదించారని ఇటీవల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన ఆరోపణలపై లక్ష్మారెడ్డి తీవ్రంగా స్పందించారు. గురువారం బీఆర్‌ఎస్ నాయకుడి ఇంటి నుంచి స్వయంగా టేపు పట్టి కొలతలు వేసి సరిగ్గానే ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీకి చెందిన ఇంటి వద్ద కొలతలు సరిగ్గానే ఉన్నాయని.. ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి ఇళ్ల వద్ద కొలతలు వేసి సరిచేయాలంటూ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. అదే విధంగా వంద పడకల ఆస్పత్రి వద్ద తన సోదరి పేరున రెండెకరాల అసైన్డ్ భూమి ఉందంటూ తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. రికార్డులు ఉంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. తన మేనల్లుడి పేరిట ఉన్న 10 గుంటల భూమికి పక్కాగా ఆధారాలు ఉన్నాయని తెలిపారు. రంగారెడ్డిగూడలో సుమారు 80 ఎకరాల దేవాదాయశాఖ భూమిపై అనుమానాలు ఉన్నాయని.. దీనిపై శ్వేత పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను అసైన్డ్ దారులకు డబ్బులు ఇచ్చి వంద పడకల ఆస్పత్రికి, రంగారెడ్డిగూడలో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి భూ సేకరణ చేపట్టామన్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాతబజార్ ప్రాంతానికి వాహనాలు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని మరోసారి స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరించాల్సిన ఎమ్మెల్యేనే గందరగోళంగా మాట్లాడటం శోచనీయమన్నారు. ఇక పోలేపల్లి సెజ్ నుంచి తన ఖాతాలోకి డబ్బులు వచ్చాయనే దాన్ని కూడా నిరూపించాలన్నారు. గంగాపూర్-బాలానగర్ రోడ్డు విస్తరణ పనులను తాము మంజూరు చేసినవేనని.. అలా కాదంటే కొత్త జీఓ చూపాలన్నారు. బాలానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన కుటుంబాలకు ఒక్క రూపాయి పరిహారం ఇప్పించలేక పోయారన్నారు. రాష్ట్రస్థాయిలో ఆంధ్రా కోవర్టులపై మాట్లాడిన ఎమ్మెల్యే.. మొదటగా జడ్చర్లలో పనులు చేపట్టిన ఆంధ్రా కాంట్రాక్టర్ల బిల్లులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకొని జడ్చర్ల అభివృద్ధిపై దృష్టిసారించాలని హితవు పలికారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నంద,రఘు ఉన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద


జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద

- 12 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల జలాశయానికి వరద కొనసాగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం 1.07 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. ప్రాజెక్టు 12 క్రస్ట్ గేట్లు ఎత్తి 79,740 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలోని 11 యూనిట్ల నుంచి ఉత్పత్తి కొనసాగుతుందని.. ఇందుకోసం 29,220 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్-1కు 1,300, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 770, కుడి కాల్వకు 460, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 600, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.480 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

కోయిల్‌సాగర్‌కు జలకళ..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయంలో గురువారం సాయంత్రం 23.6 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో 3 అడుగుల నీరు చేరితే పాత అలుగుస్థాయి నీటి మట్టం 26.6 అడుగులకు చేరుతుంది.

సుంకేసుల జలాశయం..

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. గురువారం 49,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 13 గేట్లు ఎత్తి 51,883 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం 15 గేట్ల ద్వారా నీటి విడుదల జరగగా.. గురువారం స్వల్పంగా వరద తగ్గడంతో 13 గేట్ల నుంచి దిగువకు నీరు వదిలినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయం..

దోమలపెంట: జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి శ్రీశైలానికి వరద కొనసాగుతుండటంతో గురువారం మూడు గేట్ల నుంచి నీటిని దిగువకు వదిలారు. 1,60,843 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. గేట్ల ద్వారా 81,195 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 32,237, మొత్తం 1,48,195 క్యూసెక్కులు నాగార్జునసాగర్ జలాశయానికి చేరుతుంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20 వేల క్యూసెక్కులు, ఎంజీకేఎల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.117 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 17.325 మి.యూ. ఉత్పత్తి చేశారు.

1,800 కేజీల నల్లబెల్లం పట్టివేత


నందిన్నె చెక్‌పోస్టు వద్ద తనిఖీలో ఎక్సైజ్ సిబ్బంది

కేటీదొడ్డి: అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్న ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రాయచూర్ నుంచి కొల్లాపూర్‌కు ఆటోలో తరలిస్తున్న 60 బ్యాగుల్లో (1800 కేజీలు) నల్లబెల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహన డ్రైవర్ భరత్‌సింగ్, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్‌ఐ లింగస్వామి, జగదీష్, శేఖర్‌నాయుడు, రాములు పాల్గొన్నారు.

1,200 కిలోలు..


పట్టుబడిన నల్లబెల్లంతో ఎస్‌ఐ, సిబ్బంది

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో గురువారం 1,200 కిలోల నల్లబెల్లం పట్టుకొని కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని మైసమ్మ గేటు వద్ద గురువారం తెల్లవారుజామున వాహన తనిఖీలు చేపడుతుండగా మద్దూర్ నుంచి వస్తున్న బొలెరో వాహనంలో రూ.60 వేల విలువైన నల్లబెల్లాన్ని గుర్తించామన్నారు. డ్రైవర్ సురేష్‌ను విచారించగా కర్ణాటక గుర్మిట్కల్ నుంచి నాగర్‌కర్నూల్‌కు తరలిస్తున్నామని చెప్పారని.. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు వివరించారు.

'హరిహర వీరమల్లు'ను అడ్డుకుంటాం


పీయూ ముఖద్వారం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సినీ హీరో, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లుకు వ్యతిరేకంగా పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం పీయూ ముఖద్వారం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితాన్ని వక్రీకరిస్తూ సినిమా తీయడం తెలంగాణ ఉద్యమ యోధులను అవమానించడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ నాయకులు శివముదిరాజ్, బెక్కం జనార్దన్, బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్, తాయప్ప, వెంకటేష్, గాలెన్న, రామ్మోహన్, రవీందర్ పాల్గొన్నారు.

పట్ట పగలే ఇంట్లో చోరీ

బంగారు, వెండి ఆభరణాల అపహరణ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం పోలీసులు

చిన్నచింతకుంట: గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలు ఇంట్లోకి చొరబడి రూ3.30లక్షల విలువ గల వస్తువులు చోరీ చేసిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని ఉంద్యాల గ్రామానికి చెందిన మహమ్మద్ అక్రమ్, అతని తల్లి ఫహిదా బేగం గాజుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారు మధ్యాహ్నం సమయంలో ఇంట్లోనే నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి 3.9 తులాల బంగారం, 19 తులాల వెండి ఆభరణాలతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. తల్లీకొడుకులు సాయంత్రం సమయంలో ఇంట్లో తెరిచి ఉన్న బీరువాను చూసి అందులో ఉన్న వస్తువులు కనిపించక పోయేసరికి ఆందోళన చెందారు. వెంటనే చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై గురువారం ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు క్లూస్‌టీంతో ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు.

తేజేశ్వర్ హత్యకేసులో రిమాండ్ ఖైదీల విచారణ

గద్వాల క్రైం: రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గద్వాల పట్టణంలోని గంట వీధికి చెందిన తేజేశ్వర్ (ప్రైవేటు సర్వేయర్) హత్య కేసులో రిమాండ్ ఖైదీలను గురువారం గద్వాల పోలీసులు విచారించారు. కోర్టు అనుమతి మేరకు నలుగురు ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకుని కేసు వ్యవహారాన్ని వీలైనంత త్వరగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేసి నిందితులకు కఠినంగా శిక్ష పడేలా జిల్లా పోలీస్ శాఖ విచారణ అధికారులు కసరత్తు చేపట్టారు. అందులో భాగంగా ప్రధాన నిందితులైన ఎ-1 తిరుమల రావు, ఎ-3 కుమ్మరి నాగేశ్, ఎ-4 చాకలి పరశురాముడు, ఎ-5 చాకలి రాజును హత్య కేసు వ్యవహార, హత్యకు దారి తీసిన వ్యవహారాలపై ఆరా తీశారు. సర్వేర్ హత్యకు ప్రణాళికల వ్యవహారంలో జీపీఎస్ ట్రాక్ ఇంట్లో రహస్యంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఏర్పాట్లు ఐశ్వర్య పాత్రపై నిందితులను విడివిడిగా విచారించినట్లు తెలిసింది. హత్యకు సుపారీ గ్యాంగ్‌తో ఎన్ని రూ.లక్షలకు ఒప్పందం తీసుకున్నారు. హత్యకు అవసనమయ్యే నగదు, ఆయుధాలు ఎక్కడి నుంచి సమకూర్చారనే అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. రిమాండ్ ఖైదీల వాంగ్మూలాన్ని మరోసారి పోలీసులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో మరికొంత మంది నిందితులను అదుపులోకి తీసుకుని విచారించే అవకాశాలు ఉన్నాయని పోలీసు ఉన్నాతాధికారులు చెబుతున్నారు. అయితే గతనెల 26వ తేదీన 8మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా.. నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిసింది. నిందితులు నేడు, రేపు బెయిల్‌కు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉండడంతో పోలీసులు మరోసారి నిందితులను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకోవడం హాట్‌టాఫిక్‌గా మారింది.

18 తులాల బంగారం చోరీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బత్తిని సురేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లారు. ఈ క్రమంలో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లో చొరబడి 18 తులాల బంగారం, 20వేల నగదు అపహరించారని ఆయన వెల్లడించారు. బాధితుడు సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నాగల్‌కడ్మూర్‌లో ఉద్రిక్తత

అదృశ్యమైన వివాహిత మృతి.. కోయంబత్తూర్‌లో రైల్వే ట్రాక్‌పై మృతదేహం


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు


కుమారుడితో మాధవి (ఫైల్)

భర్తే కొట్టి చంపారంటూ తల్లిదండ్రుల ఆరోపణ

అమరచింత: వివాహిత మాధవి (26) మృతికి భర్త శివ కారణమంటూ బంధువులు భర్త ఇంటిపై దాడికి యత్నించిన ఘటన మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో గురువారం చోటు చేసుకోగా ఉద్రిక్తతకు దారితీసింది. సీఐ శివకుమార్ ఇరువర్గాలను శాంతింపజేసి వివాదాన్ని సద్దుమణిగించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కుర్వ శివకు గద్వాల జిల్లా కొండపల్లికి చెందిన మాధవితో మూడేళ్ల కిందట వివాహం జరగగా 11 నెలల కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేసేవారు. శివకు భార్యపై అనుమానం ఉండటంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు కొనసాగాయి. అనుమానం అధికమై రెండు నెలల కిందట మాధవిని ఉద్యోగం మాన్పించాడు. ఆమె వద్ద ఉన్న సెల్‌నంబర్‌ను సైతం బ్లాక్ చేయడంతో ఇరువురు మధ్య గొడవలు అధికమయ్యాయి. ఆదివారం తొలి ఏకాదశి రోజున ఆలయానికి వెళ్దామని శివ భార్యకు చెప్పగా ఆమె నిరాకరించడంతో వదిలి వెళ్లారు. అదేరోజు మాధవి ఇంటి నుంచి కనిపించకుండా పోవడంతో హైదరాబాద్ పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజుల కిందట ఆమె మృతదేహం తమిళనాడులోని కోయంబత్తూర్ రైల్వే ట్రాక్‌పై పడి ఉండటం.. అక్కడి రైల్వే పోలీసులు ఆధార్‌కార్డులో ఉన్న తండ్రి సెల్‌నంబర్ ఆధారంగా సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన కుటుంబ సభ్యులతో పాటు భర్త శివ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం నాగల్‌కడ్మూర్‌కు తీసుకొచ్చారు.

పోలీసుల సమన్వయంతో అంత్యక్రియలు..

తమ కుమార్తెను చిత్రహింసలకు గురిచేసి కొట్టి చంపారని మాధవి తల్లిదండ్రులతో పాటు బంధువులు, గ్రామస్తులు శివ కుటుంబంపై దాడికి యత్నించగా సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో మదనాపురం, ఆత్మకూర్ ఎస్‌ఐలు, సిబ్బంది గ్రామానికి చేరుకొని వారితో మాట్లాడారు. వివాహ సమయంలో ఇచ్చిన 22 తులాల బంగారం, రూ.5 లక్షలు ఇవ్వాలని పట్టుబట్టడంతో తిరిగి ఇస్తామని నాగల్‌కడ్మూర్ గ్రామ పెద్దలు హామీ ఇవ్వడంతో శాంతించారు. అంత్యక్రియలు జరిగే వరకు పోలీసులు గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

నల్లమలలో తప్పిపోయిన.. తోకల మల్లయ్య మృతి


తోకల మల్లయ్య (ఫైల్)

మన్ననూర్: నల్లమల అడవిలో 12 రోజుల క్రితం తప్పిపోయిన లోతట్టు ప్రాంతం అప్పాపూర్ గ్రామానికి చెందిన తోకల మల్లయ్య(64) మృతదేహం కనిపించిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. తోకల మల్లయ్య అటవీశాఖలో వాచర్ ఉద్యోగం చేసి గత మూడేళ్ల క్రితం పదవీ విరమణ పొందాడు. ఈ క్రమంలో స్వగ్రామం అప్పాపూర్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అయితే 12 రోజుల క్రితం రెండు కుక్కలను వెంటపెట్టుకుని అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం అడవిలోకి వెళ్లాడు. కాగా.. అదేరోజు సాయంత్రం రెండు కుక్కలు ఇంటికి వచ్చినా మల్లయ్య మాత్రం రాలేదు. దీంతో మరుసటి రోజు కుటుంబ సభ్యులు, గ్రామ యువకులు అడవిలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే గురువారం మల్లయ్య మృతదేహం లభించినట్లుగా లింగాల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లు తెలిసింది. మల్లయ్యకు ఇద్దరు భార్యలు, 9 మంది పిల్లలు ఉన్నారు. ఈయన మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కందనూలు: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. భూత్పూర్ మండలం ఖిల్లాఘనపూర్‌కు చెందిన వెంకటమ్మ (65) కొడుకు బిజినేపల్లి మండల కేంద్రంలో మేస్త్రి పని చేసుకుని జీవనం సాగిస్తుండగా, ఆమె కొడుకు వద్ద ఉంటోంది. ఆమె మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి చెంచుగూడకు వెళ్లి తన కూతురు వద్దే ఉంటోంది. ఈనెల 7న చెంచుగూడలో ఓ కల్లు దుకాణంలో కల్లు తాగింది. దీంతో ఆమెకు వాంతులు, విరేచనాలు కావడంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కల్తీకల్లు తాగడం వల్ల మృతి చెందినట్లు ఆమె కుమారుడు నాగరాజు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.